క్లుప్తంగా

టెన్నిస్ సాధనతో చక్కని ఆరోగ్యం



గుంటూరు వెస్ట్ (క్రీడలు) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అండర్–13,16 బాలబాలికల టెన్నిస్ పోటీల్ని క్లబ్ అధ్యక్షుడు కె.వి. భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్నిస్ సాధనతో చక్కని ఆరోగ్యంతో పాటు క్రీడాస్ఫూర్తి కలుగుతుందని చెప్పారు. చిన్నప్పటి నుంచే ఇతరులతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పరచుకోవాలని తెలిపారు. అనంతరం 60 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పి.సతీష్, రిషిత్, అంకాల సుబ్బారావు, డైరెక్టర్లు ఆంజనేయులు, విశ్వేశ్వరరావు, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ

నెహ్రూనగర్: 55వ డివిజన్ పరిధిలోని బొంగరాల బీడులో అనారోగ్య కారణంతో మృతి చెందిన కైలా రాజశేఖర్ కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా కింద రూ.10వేల ఆర్థిక సాయాన్ని కార్పొరేటర్ అంబేడ్కర్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ పెద్దలు సువార్తమ్మ, రాంబాబు, పిచ్చయ్య పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు

పట్నంబజారు: బార్ అండ్ రెస్టారెంట్‌లో జరిగిన ఘర్షణపై పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదయ్యాయి. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరు కుమ్మరి బజారుకు చెందిన దామాల హరీష్ ఈనెల 22న పది మంది స్నేహితులతో కలసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని స్వాతి బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగుతున్నారు. ఈ సమయంలో పెద్దపెద్ద కేకలు వేస్తున్న సమయంలో బార్ క్యాషియర్ రాజు వారిని వారించాడు. ఈ నేపథ్యంలో ఘర్షణ జరిగింది. దీనిపై క్యాషియర్ రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్యాషియర్, మరికొంత మంది కలసి ఖాళీ సీసాలతో కొట్టినట్లు హరీష్ ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కారు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో జేకేసీ కళాశాల రోడ్డులో 6969 నంబరు కారు అతి వేగంగా వెళుతూ, నడుచుకుంటూ వెళుతున్న ఇమ్రాన్, నజీరుద్దీన్‌ను ఢీకొట్టింది. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర పోస్టింగ్‌లపై కేసు నమోదు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి దంపతులపై అసభ్యకర పోస్టింగ్ పెడుతున్న వారిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌స్ట్రాగామ్‌లో స్టేట్ రైడర్స్ అనే ఐడీతో అసభ్యకర పదజాలంతో పోస్టింగ్‌లు వస్తున్నాయి. ఇది గమనించిన వైఎస్సార్ సీపీ మహిళ నాయకురాలు తోట కూర స్వర్ణలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంబంధిత ఐడీకి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మీపురం: నంబూరు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరు రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నంబూరు రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో రైలు వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పట్టాల పైకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల్ని విచారించారు. వ్యక్తికి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉంటాయని, ఆచూకీ తెలిసిన వారు రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ స్వరూప్‌కుమార్‌రెడ్డి(9550523485) నంబరుకు లేదా జీఆర్పీ పోలీసు స్టేషన్ నంబరు (0863- 2220753)కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

రెండు డీజే వాహనాలు సీజ్

పెదనందిపాడు: అనుమతి లేకుండా వినాయక నిమజ్జనంలో ఉపయోగించిన రెండు డీజే వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం నాగులపాడు, పాలపర్రుల్లో డీజే వాహనాలను, డాన్సర్లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

గణపయ్యా.. భక్తిశ్రద్ధలతో మొక్కెదమయ్యా..!



కేవీపీ కాలనీలో గణనాథుడికి బెలూన్లతో అలంకరణ



అన్నదానం చేస్తున్న నూరిఫాతిమా

నెహ్రూనగర్: నగరంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గణపతిని రోజుకొక అలంకారం చేసి పూజలు నిర్వహిస్తున్నారు. కేవీపీ కాలనీ 1/10లో 17వ వినాయక చవితి వేడుకలు 21వ డివిజన్ కార్పొరేటర్ కాండ్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. శనివారం గణనాథుడ్ని బెలూన్లతో ఘనంగా అలంకరించారు. ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు గురవయ్య తెలిపారు.

కుల,మతాలకతీతంగా గణేశుని ఉత్సవాల్లో పాల్గొనాలి

పట్నంబజారు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నగరంలో పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకలు, అన్నదానాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా పాల్గొన్నారు. పాత గుంటూరు, కొత్తపేట, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ దేవుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ గణేశుని ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ విఘ్నాలు తొలగి వారు చేపట్టే కార్యక్రమాల్లో మేలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాట్ల రవి, వైఎస్సార్ సీపీ నేతలు రాచమంటి భాస్కర్, తోట రామదాస్, ఎర్రబాబు పాల్గొన్నారు.



ఆర్. అగ్రహారంలో విద్యా గణపతి అలంకారంలో గణనాథుడు

విద్యా గణపతిగా దర్శనం

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలో వాసవీ యూత్ ఆధ్వర్యంలో 25వ శ్రీ విజయ గణపతి నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం స్వామి విద్యా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పుస్తకాలు, పెన్నులు, అట్టలతో స్వామిని అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాల్ని వాసవీ యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగ వెంకట నారాయణ, కోశాధికారి కాజా శ్యామసుందర్ పర్యవేక్షించారు.

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

- విద్యుత్ అదాలత్‌లో సీజేఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్
- 23 ఫిర్యాదులకు గానూ పద్నాలుగు పరిష్కారం



వినియోగదారునితో మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానియేల్

నగరంపాలెం: విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవల్ని అందించడంతో పాటు వారి సమస్యల్ని వెంటనే పరిష్కరించేందుకు ప్రతి అధికారి సమర్థంగా పని చేయాలని సీజేఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. గుంటూరు టౌన్–1 డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సంగడిగుంట విద్యుత్ భవన్‌లో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలు, గుంటూరు రూరల్, పెదకాకాని మండలాల్లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అదాలత్‌తో పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేల్ మాట్లాడుతూ వినియోగదారులు ఏదైనా చిన్న సమస్యతో కార్యాలయాలకు వస్తే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. చిన్న సమస్యలకు సైతం న్యాయస్థానాల్ని ఆశ్రయించే పరిస్థితి తేవద్దని చెప్పారు. విద్యుత్ అదాలత్‌లను వినియోగదారుల సౌకర్యార్థమే నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 23 ఫిర్యాదులు రాగా అందులో పద్నాలుగును వెంటనే పరిష్కరించినట్లు చెప్పారు. మిగతా తొమ్మిది ఫిర్యాదుల్ని 15 రోజుల్లో పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు కె.వెంకటకృష్ణ, స్వతంత్ర సభ్యుడు ఏ.సునీత, గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఆవుల మురళీకృష్ణయాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాస్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా జడ్జ్ పి.వి.రాంబాబు



గుంటూరు రూరల్: విద్యార్థి దశ నుంచి చట్టం గురించి తెలుసుకోవాలని, అది అందరి బాధ్యతని జిల్లా జడ్జి పి.వి.రాంబాబు తెలిపారు. నగర శివారుల్లోగల లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ ఏదైనా సమస్య వచ్చినపుడు దాన్ని పరిష్కరించడానికి న్యాయపరమైన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తుల్ని ధ్వంసం చేయరాదని, ఖాళీ పేత్రాలు, డాక్యుమెంట్స్‌పై సంతకాలు చేయరాదని తెలిపారు. న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని చెప్పారు. ప్రముఖ న్యాయవాది కాళిదాసు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు తొలగించాలి



గుంటూరు రూరల్: అనుమతి లేకుండా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. గుంటూరు–పొన్నూరు జాతీయ రహదారిలో బుడంపాడు శివారుల్లో ఒక ప్రైవేట్ కళాశాల వద్ద రోడ్డుపై అక్రమంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడమే కాకుండా వీటి ముందు కనీసం జీబ్రా గీతలు కూడా లేకపోవడం, వాటిని వాహనదారులు గుర్తించడానికి వీలుగా ముందుగా సైన్ బోర్డుల ఏర్పాటు వంటివి లేక ఇబ్బంది ఎదురవుతోంది. దగ్గరకు వచ్చే వరకు ఇవి కనిపించక, ఒక్కసారిగా వాహనాలకు బ్రేకులు వేస్తుండటంతో వెనుకగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. గత వారం రోజుల్లో ఈ స్పీడు బ్రేకర్ల వద్ద రోజుకు రెండు ప్రమాదాల చొప్పున జరిగాయని, అయితే ఎటువంటి ప్రాణ నష్టం లేకపోయినా వాహనాలు ధ్వంసమైన ఘటనలు ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన ఈ స్పీడ్ బ్రేకర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని పలువురు కోరుతున్నారు.

‘అమ్మ తలపులు’ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రభాకర్, దుర్గా ప్రసాద్, మస్తానయ్య తదితరులు

పాత గుంటూరు: భారతీయ సంగీతానికి ప్రకృతి పరవశిస్తుండటం జగమెరిగిన సత్యం అని ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఓఎస్‌డీ డాక్టర్ ఎం. ప్రభాకర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై శనివారం ప్రముఖ డోలు విద్వాంసుడు భూసురపల్లి ఆదిశేషయ్య ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ‘అమ్మ తలపులు’ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం భూసురపల్లి ఆదిశేషయ్య సంగీత పురస్కారాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ద్వారం దుర్గా ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎం. కోటేశ్వరరావు, డాక్టర్ సి. చంద్రమోహన్, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రాహుల సురేష్ బాబు, ప్రదీప్తి, ప్రహ్లాదుడు, మౌనిక, వేదవ్యాసుడు పాల్గొన్నారు.

నేడు పొన్నూరులో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

కొరిటెపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టీ, కాపు సేవా సమితి పొన్నూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పొన్నూరులోని సాయి దివ్య ఫంక్షన్ హాలులో ఆదివారం పేద విద్యార్థులకు రూ.4 లక్షల ఉపకార వేతనాల్ని పంపిణీ చేయనున్నట్లు తులసి సంస్థల అధినేత తులసి రామచంద్ర ప్రభు తెలిపారు. కాపు సేవా సమితి పొన్నూరు శాఖ సభ్యులు శనివారం అరండల్‌పేట 3వ లైనులోని తులసి భవన్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. పొన్నూరులో ఆదివారం జరగనున్న విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీకి ముఖ్య అతిథిగా రావాలని రామచంద్ర ప్రభును ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టీ తులసి రామచంద్ర ప్రభు రూ.2 లక్షలు, కాపు సేవా సమితి పొన్నూరు శాఖ రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.4 లక్షల్ని 120 మంది విద్యార్థులకు అందజేయనున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం అరండల్‌పేట తులసి భవన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని బీజేపీ నేతలు నిర్వహించారు. శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తులసి రామచంద్రప్రభు, తులసి యోగేష్ చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ మోదీ భరతమాత ముద్దుబిడ్డ అని, ఆయన కోసం ఎన్ని సేవా కార్యక్రమాలు చేసినా తక్కువేనని తెలిపారు. భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా మోదీ చాటి చెబుతున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా బీజేపీ నేతలంతా మోదీ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేయడం అభినందనీయమని తెలిపారు. యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు మైలా హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో బీజేపీ నేతలు కుమార్ గౌడ్, అప్పిశెట్టి రంగ, భాస్కర్, యడ్లపాటి స్వరూప రాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఆరుగురు శేకూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్.ఎం, ఉపాధ్యాయులు

శేకూరు(చేబ్రోలు): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు చేబ్రోలు మండలం శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కేఎస్ఎన్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు వీవీడీ కిశోర్ శనివారం తెలిపారు. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ బాలబాలికల జట్లు ఎంపిక జరిగింది. గుంటూరు జిల్లా హ్యాండ్ బాల్ బాలుర, బాలికల జట్టులో శేకూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన జి. లుధియా, టి. లిఖిత, ఎం. సాయి దుర్గ, టి. స్మైలీ, బి. రాజేశ్వరి, బి. గోపయ్యస్వామి ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 29నుంచి అక్టోబర్ 1 వరకు తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు తరపున పాల్గొంటారు. విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మన్ ఎం. గోపి, ఉపాధ్యాయులు మేకల సుబ్బారావు, బి. ముత్యాలరావు, ఎ. నరేంద్ర అభినందించారు.

ఉద్యోగ నిర్వహణలో సమగ్రత, నిబద్ధత రెండు కళ్లు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో శ్రవణ్, ఎస్వీ రమణ, లక్ష్మీనారాయణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రత, నిబద్ధత రెండు కళ్లుగా భావించి ప్రతి ఒక్కరు ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తించాలని డెవలప్ ట్రీస్ సంస్థ వ్యవస్థాపక సీఈవో డి. శ్రవణ్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో చదివి, వివిధ సంస్థల్లో ఉద్యోగాల్ని సాధించిన విద్యార్థుల్ని శనివారం జాబ్ విన్నర్స్ కాన్‌క్లేవ్ పేరుతో సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రవణ్ మాట్లాడుతూ ఉద్యోగ రంగంలో ఉన్నత దశకు చేరుకోవాలన్నా, సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించాలన్నప్పటికీ ప్రధానంగా సమయపాలన, టీం వర్క్, పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని తెలిపారు. ఏ ఉద్యోగంలో చేరినా కుటుంబంతో పాటు దేశాభివృద్ధిని సైతం దృష్టిలో పెట్టుకుని జీవితంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగంలో స్థిరత్వం, పని చేసే సంస్థపై విధేయత, విశ్వాసం ఉంటే ఎదుగుల కచ్చితంగా ఉంటుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ కంపెనీల్లో నెలకు రూ.40వేల వేతనంతో ఉద్యోగాల్ని పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఆచార్య డాక్టర్ కె. లలిత, పరిపాలన డైరెక్టర్ డి. కల్యాణి, సహాయాచార్యులు ఏ.బాజీబాబు, సీహెచ్. వేదవతి, బి. అనిత, వి. అభిలాష్, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

‘రాజకీయాల ప్రయోజనాలకే మహిళా రిజర్వేషన్లు’

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయాల ప్రయోజనాలకే మహిళా రిజర్వేషన్లకు తెర తీసిందని ప్రగతి నారీశక్తి జాతీయ అధ్యక్షురాలు పాట్లూరి దేవి విమర్శించారు. అమరావతి రోడ్డులోని ప్రగతి నారీశక్తి కార్యాలయంలో శనివారం జరిగిన మహిళల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం నూతన పార్లమెంటులో బీజేపీ సారథ్యంలో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల బిల్లు దేశ జనాభాలో 80 శాతానికి పైగా ఉన్న మెజారిటీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ భారతీయ మహిళలకు ఆమోదయోగ్యం కాదని తెలిపారు. కేవలం బీజేపీ తన రాజకీయ అవసరాల కోసమే ఎలక్షన్‌లను దృష్టిలో ఉంచుకుని పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఆమోదింపచేసుకుందని తెలిపారు. పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల చట్టంలో సామాజిక న్యాయం కనపడటం లేదని పేర్కొన్నారు. కేవలం లోక్ సభ, రాష్ట్రాల శాసన సభ్యులకే మహిళా రిజర్వేషన్లు పరిమితమవుతాయని, ఎగువ సభలకు ఆమోదించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి, పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా జనాభా లెక్కింపు, నియోజకవర్గాల పునర్విభజన చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించే వారని తెలిపారు. వచ్చే ఏడాది ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చట్టాన్ని ఆమోదించుకున్నారని ఎద్దేవా పేర్కొన్నారు. ఎంతో ఆర్భాటంగా రిజర్వేషన్ బిల్లుని ఆమోదించుకున్న బీజేపీ ప్రభుత్వం, దాని అమలుకు 15 ఏళ్ల కాలం పడుతుందని చెప్పడం దివాలాకోరు రాజకీయ విధానాలకు అద్దం పడుతోందని విమర్శించారు. తక్షణం నియోజకవర్గాల పునర్విభజన, కులగణన చేసి మహిళా రిజర్వేషన్లతో కూడిన పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలని పాట్లూరి దేవి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు రాజకుమారి, శ్రీ నీలత, రత్నశ్రీ, సుజాత, రాధమ్మ, భాగ్యలక్ష్మి, సుమతి, టి.వి.ఆర్. కుమారి, సింధూరి పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి



సీడీ భగవాన్‌ను సత్కరిస్తున్న పోలూరు వెంకటరెడ్డి తదితరులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి న్యాయ వ్యవస్థ పటిష్టతకు కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర నాయకుడు పోలూరు వెంకటరెడ్డి చెప్పారు. లీగల్ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సి.డి.భగవాన్‌ను అరండల్‌పేటలోని కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. న్యాయవాదులు, వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలూరు వెంకటరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. వంద కోట్ల రూపాయలను న్యాయవాదుల సంక్షేమానికి అందజేసిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌కే దక్కుతోందని చెప్పారు. జూనియర్ న్యాయవాదులకు ఆయన స్టైఫండ్ అందజేసి న్యాయవాద వృత్తిలోకి వచ్చిన ఎంతో మందికి మనోధైర్యాన్ని కల్పించారని వివరించారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సి.డి.భగవాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం సభ్యులు, న్యాయవాదులు కె.వెంకటరమణారెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, వజ్రాల రాజశేఖరరెడ్డి, కోటేశ్వరరావు, సుదర్శన్, క్రాంతికుమార్, బి.సాగర్, బాలాజీ, వి.సూరిబాబు, అశోక్‌కుమార్, ఝాన్సీలక్ష్మి, నజీరా, శరత్, మహేంద్ర పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణతో నాయకత్వ లక్షణాల పెంపు



బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న పద్మావతి, ఎంవీఆర్‌కే ముత్యాలు, రూపచంద్రరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల్ని పెంపొందించడంలో ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణ దోహద పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత చల్లా పద్మావతి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ 1969లో కొఠారి కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రస్తుతం లక్షలాది మంది విద్యార్థులతో పాఠశాల, కళాశాల, యూనివర్సిటీ స్థాయిల్లో అభివృద్ధి చెందిందన్నారు. సామాజిక సేవలకు మారుపేరుగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా నీడ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, అధ్యక్షులు రూపచంద్రరావు,, ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోస్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వేణుగోపాలరావు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు

మేలైన విస్తరణ సేవలు అందించాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వరు

గుంటూరు రూరల్: రైతులకు మేలైన విస్తరణ సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయం నందున్న కృషి భవన్‌లో ఏర్పాటు చేసిన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలోని ఎంపిక చేసిన 40 మంది ఎరువులు, పురుగు మందులు డీలర్లకు వ్యవసాయ విస్తరణ సేవల డిప్లొమా కోర్సు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతులకు డీలర్లు మేలైన ఎరువులు, పురుగు మందులు అందిస్తూ వారి అభివృద్ధికి సహకరించాలన్నారు. పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి మాట్లాడుతూ రైతులకు అవరాన్ని బట్టి డీలర్లు సరైన నాణ్యమైన వ్యవసాయ వనరులు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందజేయాలని సూచించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ ఈ కోర్సు సంవత్సరంపాటు ఉంటుందని, ప్రతి ఆదివారం క్లాసులు నిర్వహిస్తారన్నారు. శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు డీలర్లకు అవసరమైన శిక్షణ అందిస్తారన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త టి. వెంకటేశ్వర్లు, కె. వేణుకృష్ణ పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం కల్పిస్తే చర్యలు

గుంటూరు పోస్కో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల

చేబ్రోలు: బాలల హక్కులకు భంగం కల్పిస్తే చర్యలు తప్పవని గుంటూరు పోస్కో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ సమస్యలు – సవాళ్లు అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ శనివారం జరిగింది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల మాట్లాడుతూ బాలల హక్కులైన విద్యాహక్కు చట్టం, జీవించే హక్కుతో పాటు ఇతర చట్టాల గురించి తెలియజేశారు. పోలీసులు బాలలకు కల్పించే రక్షణ, మంచి స్పర్శ, చెడు స్పర్శ, పోక్సో చట్టం, చట్టంతో విభేదించిన బాలురకు ప్రత్యేక బాలల కోర్టులు, రక్షణ కేంద్రం గురించి విద్యార్థులకు వివరించారు. గుంటూరులోని జువెనైల్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ వాసంతి మాట్లాడుతూ లైంగిక వేధింపులు, బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా వంటి వివిధ మార్గాల్లో పిల్లలు సులభంగా దోపిడీకి గురవుతారని తెలిపారు.పోక్సో చట్టం గురించి ఫిర్దోస్ కుతుబ్ వాని, సరస్వతి రాజు అయ్యర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.